నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 6 ఆగస్టు 2024 | MEDAK



ఇటీవల మెదక్ ఏపీజీవీబీ ఎదుట బారులుతీరిన రైతులు

రైతుల్లో రుణమాఫీ రంధి

అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతన్నలు

- గ్రీవెన్స్‌కు వెల్లువలా ఫిర్యాదులు
- రైతుల్లో మాఫీ అవుతుందో.? లేదో..? అన్న టెన్షన్
- సహకార బ్యాంకు రుణాల్లో అంతా గందరగోళం
- ప్రభుత్వ కటాఫ్‌తో చాలామంది రైతులకు రుణమాఫీ కట్
- రేషన్ కార్డు, టెక్నికల్ సమస్యలతో మాఫీ గందరగోళం
- రుణం ఉన్నప్పటికీ రుణ ఖాతా లేదని సాకులు చెబుతున్న బ్యాంకు అధికారులు

సిద్దిపేట, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రైతుల్లో రుణమాఫీ టెన్షన్ వెంటాడుతోంది. మా రుణాలు మాఫీ అవుతాయా..? కావా..? అనే ఆందోళన రైతుల్లో నెలకొంది. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, రెండు విడుతల్లోనూ రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేవని రైతులు వాపోతున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని వేలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. తమకు రుణమాఫీ ఎందుకు కాలేదని అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఒకే ఇంటి పేరుతో ఉన్న రైతులను ఒకే కుటుంబంగా చూపుతున్నారన్న విమర్శలు సైతం ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో రేషన్ కార్డు ఉన్నప్పటికీ ఆ కుటుంబానికి రుణమాఫీ కాలేదు. ఇంకో కుటుంబంలో ఇద్దరి పేర్ల మీద రుణాలు ఉంటే అందులో ఒక్కరు ఇదివరకు బ్యాంకులో రుణం క్లోజ్ చేస్తే ఆ రైతుకు రుణ మాఫీ వచ్చినప్పటికీ బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదు. ఎందుకంటే రుణ ఖాతా క్లోజ్ అయింది నీకు రుణమాఫీ డబ్బులు ఇవ్వమని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన గడువులో ఆ రైతుకు రుణమాఫీ వచ్చిందని మెసెజ్ సైతం వచ్చింది. బ్యాంకు అధికారులు ముప్పు తిప్పలు పెడుతున్నారు. ఇలా ఎంతో మంది రైతులు నష్టపోతున్నారు. సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మాఫీ రావడం లేదని పలువురు రైతులు తెలుపుతున్నారు. రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు తీసుకుంటున్నారు. కానీ మాఫీ అయితదా..? లేదా..? అని రైతుల్లో ఆందోళన నెలకొన్నది.

సహకార బ్యాంకుల్లో అంతా గందరగోళం

సార్.. మాకెందుకు రుణమాఫీ కాలేదు. మేమేమి తప్పు చేశాం...అంటూ రైతులు గొల్లుమంటున్నారు. సహకార బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలు అంతా గందరగోళంగా ఉన్నాయి. అర్హత ఉన్న చాలా మంది రైతులకు రుణాలు మాఫీ కాలేదు. ఇదేంటని సొసైటీ అధికారులను అడిగితే సరైన సమాధానం రావడం లేదు. ఏదేదో సాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా 50శాతం రుణాలు కూడా మాఫీ కాలేదని రైతులు వాపోతున్నారు. సంగారెడ్డి జిల్లాలో 37 సొసైటీల్లో 22,086 మంది రైతులు రూ.212.46 కోట్లు రుణాలు తీసుకున్నారు. వీరిలో తొలి విడుత 6,090 మంది రైతులకు రూ.25.13 కోట్లు, రెండో విడుతలో 2,134 మంది రైతులకు రూ.21. 02 కోట్లు, మెదక్ జిల్లాలో 31 సొసైటీల్లో 29,519 మంది రైతులు రూ.153.76 కోట్లు రుణాలు తీసుకున్నారు. వీరిలో తొలి విడుతలో 9,271 మం దికి రూ.34.39 కోట్లు, రెండో విడుతలో 2,599 మంది రైతులకు రూ.18.61 కోట్లు, సిద్దిపేట జిల్లాలో15 సొసైటీల్లో 11,980 మంది రైతులు రూ.85.17 కోట్ల రుణాలు తీసుకున్నారు. వీరిలో తొలి విడుతలో 4,193 మందికి రూ. 15.69 కోట్లు, రెండో విడుతలో 1,345 మంది రైతులకు రూ. 10.74 కోట్ల రుణమాఫీ వచ్చింది. ఇంకా ఉమ్మడి జిల్లాలో చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు ఆయా సహకార బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు రుణమాఫీ అవుతుందా...? లేదా అని వారిలో ఆందోళన నెలకొన్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని కొన్ని సొసైటీల లెక్కలు చూస్తే చాలామంది రైతుల రుణాలు మాఫీ కాలేదని అర్థమవుతుంది.

సిద్దిపేట : రైతుల పంటరుణ మాఫీపై ఇటీవల ఎస్‌బీఐ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి (ఫైల్)

- చేర్యాల సహకార సంఘంలో 1,001మంది రైతులు ఉన్నారు. వీరిలో 508 మందికి రూ.కోటి మాఫీ అయింది. ఇంకా 493 మందికి రుణమాఫీ కావాల్సి ఉంది. రెండో విడుతలో లక్షన్నరలోపు రుణాలు తీసుకున్నవారు 170 మంది రైతులు ఉన్నారు. వీరిలో 154 మందికి రుణమాఫీ అయ్యింది. ఇంకా 16 మందికి రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు తమకు రుణమాఫీ అవుతుందా..? కాదా అని బిగాలుగా చూస్తున్నారు.
- హుస్నాబాద్ సహకార బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులు 977 మంది ఉన్నారు. వీరిలో లక్ష రూపాయల రుణాలకు 575 మంది అర్హులు కాగా, వీరిలో 308 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. ఇంకా 267 మందికి రుణమాఫీ కాలేదు. రెండో విడుతలో లక్షన్నరలోపు రుణం తీసుకున్న వారు 248 మంది రైతులు. ఇందులో కేవలం 178 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. ఇంకా 70 మంది ఉన్నారు.
- పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని పీఏసీఎస్‌లో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్‌లో ఈ బ్యాంకుల్లో ఒక్కరు కూడా లేరు. 2014 నుంచి 2018 వరకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 30 మంది రైతులకు రూ.19.80 లక్షలను మాఫీ చేసింది. ఈ సొసైటీలో ఇంకా రుణమాఫీ కాని రైతులు 604 మంది ఉన్నారు.
- సిద్దిపేట సొసైటీలో 943 మంది రైతులు ఉన్నారు. తొలి విడుతలో 724 మంది రైతులకు గానూ 181 మందికి రూ.48 లక్షల రుణమాఫీ వచ్చింది. రెండో విడుతలో 143 మందికి 87 మందికి మాత్రమే రూ.47 లక్షల రుణమాఫీ అయింది. దుబ్బాక సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు 950మంది. తొలి విడుతలో 305 మందికి రూ.1.27 కోట్లు, రెండో విడుతలో 109 మంది రైతులకు రూ.83 లక్షలు మాఫీ అయింది.
- గజ్వేల్ సొసైటీలో మొత్తం రైతులు 751మంది కాగా తొలి విడుతలో 381 మంది రైతులకు రూ.1.36 కోట్లు మాఫీ వచ్చింది. రెండో విడుతలో 107 మంది రైతులకు గానూ 99 మందికి మాత్రమే రుణమాఫీ వచ్చింది. రుణమాఫీ కాని రైతులంతా సొసైటీ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

రుణమాఫీ కొందరికేనా..?



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మూడు విడుతలుగా రుణమాఫీ చేస్తామని చెప్పింది. అందులోభాగంగా ఇటీవల రెండు విడుతల్లో లక్షన్నరలోపు రుణాలను మాఫీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 2,32,014 మంది రైతులకు రూ.1,596. 38 కోట్ల రుణాలు మాఫీ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇంతవరకు బాగానే ఉన్నా అసలు సమస్య ఇక్కడే ఉంది. ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పథకంలో గందరగోళం నెలకొన్నది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు మాత్రమే రుణ మాఫీ కటాఫ్ పెట్టింది. అసలు వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించింది. ఈమేరకు తొలి విడుతలో జూలై 18న లక్ష రూపాయల వరకు, జూలై 30న లక్షన్నరలోపు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ రుణమాఫీలో ప్రభుత్వ నిబంధనలు, టెక్నికల్ సమస్యలతోపాటు రేషన్ కార్డు, రుణఖాతా క్లోజ్ కావడం తదితర సమస్యలతో చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదు. ప్రధానంగా ఒక కుటుంబంలో ఎంతమంది రుణం తీసుకున్నా రూ.2 లక్షల వరకే వర్తిస్తుందని షరతు పెట్టింది. అదే కుటుంబంలో తక్కువరుణం తీసుకున్న వారిని చూసి మొత్తంగా రెండు లక్షల వరకు లెక్కలు తీసి మాఫీ చేయాల్సిన ప్రభుత్వం ఆ కుటుంబం మొత్తాన్ని పక్కన పెట్టింది. ఏమన్న అంటే మూడో విడుతలో మాఫీ అవుతుందని చెబుతున్నారు. మరోవైపు ఆ కుటుంబం మొత్తం రెండు లక్షలపైన ఉన్నది క్లీయర్ చేస్తేనే ఆ కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇలా ఎన్నో కొర్రీలు పెడుతున్నది.

సంగారెడ్డి జిల్లా వడ్డేపల్లి ఏపీజీవీబీ ఎదుట పట్టాదారు పాస్ పుస్తకాలతో క్యూలో నిలిచిన రైతులు

పంట రుణాల కోసం పాస్ పుస్తకాలతో రైతుల నిరీక్షణ

హత్నూర, ఆగస్టు 5: ప్రభుత్వం ఇటీవల పంట రుణమాఫీ చేయడంతో రైతులు తిరిగి పంట రుణాలు తీసుకోవడం కోసం బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. రుణాలు మాఫీ అయిన రైతులకు రోజుకు 30 మందికే బ్యాంకు సిబ్బంది రుణాలు మంజూరు చేస్తుండడంతో ఎక్కువ సంఖ్య లో వచ్చిన రైతులు తిరిగి వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. హత్నూర మండలం వడ్డేపల్లి ఏపీజీవీబీలో మండలంలోని 12 గ్రామాలతోపాటు నర్సాపూర్ మండలంలోని ఎల్లాపూర్, జిన్నారం మండలంలోని అండూర్ గ్రామాల రైతులు బ్యాంకులో పంట రుణాలు తీసుకున్నారు. బ్యాంకులో (1800) ఖాతాదారులు ఉండగా, మొదటి, రెండో విడుతల్లో వెయ్యిమంది రైతులకు రుణమాఫీ వచ్చింది. దీంతో రుణ మాఫీ వచ్చిన రైతులు తిరిగి రుణాలు పొందడం కోసం రోజూ బ్యాంకు వద్దకు వచ్చినా రోజు కు 30మందికి మాత్రమే రుణాలు మంజూరు చేస్తుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి వరకు పట్టాదారు పాస్ పుస్తకాలతో క్యూలైన్లో నిలిచినా సీరియల్ నెంబర్ రాకపోతే వెనుదిరిగి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిలిచిన పన్ను వసూళ్లు

- పనిచేయని హ్యాండిల్ డివైజ్ మిషన్లు
- కొత్తవి కొనుగోలుకు నిర్ణయం

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 5 : ఆస్తిపన్ను, నల్లాపన్ను వసూలు చేసే మిషన్లు 25 రోజులుగా మూలనపడ్డాయి. సాఫ్ట్‌వేర్ విషయంలో ఏర్పడిన ఇబ్బందులతో పన్ను వసూళ్లు నిలిచిపోయాయి. సాంకేతిక కారణాలు సరిచేసేందుకు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు సరైన ప్రయత్నాలు చేయకపోవడంతో కొత్త మిషన్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బల్దియాపై అదనపు భారం పడనున్నది. ప్రతి మున్సిపాలిటీలో ఆస్తిపన్నుకు సంబంధించి చేతిరాతతో ఇచ్చే రసీదులకు చెక్‌పెట్టి ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించే విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. దీనికోసం పన్ను వసూలు చేసే బిల్ కలెక్టర్లకు హ్యాండిల్ డివైజ్ మిషన్లు ఇచ్చింది. హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఐదుగురికి అధికారులు మిషన్లు అందజేశారు. వీటితో ఆయా వార్డుల్లోని ఇండ్లకు వెళ్లి ఆస్తి, నల్లా పన్ను వసూలు చేస్తున్నారు. కానీ, హ్యాండిల్ డివైజ్ మిషన్లలో ఏర్పడిన సాంకేతి కారణాలతో పన్ను వసూళ్లు నిలిచిపోయాయి. దాదాపు 25 రోజులుగా పట్టణంలో పన్ను వసూళ్లు నిలిచిపోయాయి. దీంతో మున్సిపల్‌కు నిత్యం పన్నుల ద్వారా రావాల్సిన ఆదాయం ఆగిపోయింది. ఆస్తి పన్ను చెల్లింపు ఆలస్యంతో ఇండ్ల యజమానులపై అపరాధ రుసుము పడుతున్నది. ఈ క్రమంలో పన్నులు చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయానికి రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. హుస్నాబాద్ మున్సిపాలిటీ రెండేండ్ల క్రితం ఐదు హ్యాండిల్ డివైజ్ మిషన్లు కొనుగోలు చేసింది. ఇంతలోనే సాంకేతిక సమస్యలు, సాఫ్ట్‌వేర్ మార్పుపేరుతో మళ్లీ కొత్త మిషన్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. కొత్తగా మరో ఎనిమిది మిషన్లను కొనుగోలుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మిషన్ల కొనుగోలుకు దాదాపు లక్ష రూపాయల వరకు వ్యయం కానున్నది. మిషన్లను అందజేసే కంపెనీలపై మున్సిపల్ శాఖ నుంచి సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని కొద్దినాళ్లకే వాటిని పక్కన పడేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్ స్పందించారు. ప్రస్తుతం పన్ను వసూలు చేసే మిషన్లలో సాఫ్ట్‌వేర్ మార్చే అవకాశం లేకపోవడంతో కొత్తవి ఎనిమిది కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే మిషన్లు రాగానే పన్ను వసూళ్లు యథావిధిగా చేపడతామని చెప్పారు.

హుస్నాబాద్ బల్దియాలో మూలనపడిన ట్యాక్స్ హ్యాండిల్ డివైజ్ మిషన్లు

అమెరికాలో సిద్దిపేట యువకుడి అనుమానాస్పద మృతి

నేడు స్వగ్రామం కూటిగల్‌కు సాయిరోహిత్ మృతదేహం

సాయిరోహిత్(ఫైల్)

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 5: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు అమెరికాలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తుషాలపురం మంగవ్వ-మహదేవ్‌లకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు సాయి రోహిత్(23) హైదరాబాద్‌లోని సీవీఆర్ కాలేజీలో 2022 బీటెక్ పూర్తి చేశాడు. గతేడాది డిసెంబర్ 20న ఎమ్మెస్సీ చదివేందుకు సాయిరోహిత్ అమెరికాకు వెళ్లాడు. వాషింగ్టన్ సియెటెల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరి కాలేజీలో యూనియన్ బ్రాంచ్‌లో ఎమ్మెస్సీ చదువుతున్నాడు. సాయిరోహిత్ నలుగురు స్నేహితులతో కలిసి రూమ్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. జూలై 22న సాయంత్రం 5గంటలకు బయటకు వెళ్లి తిరిగి క్యాబ్‌లో రూమ్‌కు వస్తూ కొంతదూరం రాగానే మరో క్యాబ్‌లోకి మారాడు. అప్పటి నుంచి రూమ్‌కు రాకపోవడంతో సాయిరోహిత్ స్నేహితుడు అవినాశ్ అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా) వారి సాయంతో సాయిరోహిత్ అచూకీ కోసం వివిధ ప్రాంతాల్లో వెతికారు. జూలై 24న సమానుష్ సరస్సులో సాయిరోహిత్ మృతదేహం లభ్యమైంది. జూలై 25న సాయిరోహిత్ మృతి చెందిన విషయాన్ని స్నేహితులు కూటిగల్‌లోని కుటుంబసభ్యులకు తెలిపారు. బయటకు వెళ్లిన సాయిరోహిత్ మృతదేహంగా మారి సరస్సు వద్ద లభ్యమవ్వడంతో అతడి స్నేహితులు, కుటుంబసభ్యులు మృతిపై అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయిరోహిత్ మృతదేహాన్ని కుటుంబసభ్యులు గ్రామానికి తీసుకు వస్తున్నట్లు సమాచారం.

ఎత్తిపోతలు షురూ..

శ్రీ రాజరాజేశ్వర (మిడ్‌మానేరు) రిజర్వాయర్ నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి వస్తున్న గోదావరి జలాలు

- అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి తరలివస్తున్న గోదావరి జలాలు
- అక్కడి నుంచి రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మలకు..
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖతో దిగివచ్చిన ప్రభుత్వం
- గోదావరి జలాలు తరలిరావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- రైతుల సాగు నీటి కోసం 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు

సిద్దిపేట, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల జిల్లాల సరిహద్దులోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి శ్రీ రాజరాజేశ్వర(మిడ్‌మానేరు) రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను సోమవారం నుంచి ఎత్తిపోస్తున్నారు. రెండు పంపుల ద్వారా జలాలను ఎత్తిపోస్తున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, అడుగంటిన రిజర్వాయర్ల ఫలితంగా వానకాలం సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శనివారం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి లేఖ రాయడంతో ప్రభుత్వం స్పందించి సోమవారం నుంచి మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేస్తామని చెప్పింది. అందులోభాగంగా నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్ అక్కడి నుంచి మల్లన్నసాగర్ తర్వాత కొండ పోచమ్మ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోయనున్నారు. ఫలితంగా అన్ని రిజర్వాయర్లు నిండితే పంటల సాగుకు ఇబ్బంది ఉండదు.

రైతుల సాగునీటి కష్టాలపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు

జిల్లాలోని రైతుల సాగునీటి కష్టాలపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు రాసింది. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఐదారు రోజులుగా రైతులను పలుకరించి, వారి అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో సక్సెస్ అయింది. ఎట్టకేలకు సోమవారం నుంచి గోదావరి జలాలు జిల్లాకు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మండుటెండల్లో సైతం రిజర్వాయర్లు నిండుకుండలా ఉండడంతో పాటు చెరువులు, కుంటలు సైతం మండుటెండల్లో మత్తళ్లు దుంకాయి. వర్షాకాలంలో ఒకటిరెండు పెద్ద వర్షాలు పడగానే చెరువులు కుంటలు నిండాయి. ఫలితంగా రైతులకు పుష్కలంగా సాగునీరు లభ్యమయ్యేది. ఐదారు సంవత్సరాల నుంచి రైతులకు ఎప్పుడు కూడా సాగు నీటి కొరత ఏర్పడ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సాగు నీటి కొరత ప్రారంభమైంది. జిల్లాలోని రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి పడిపోయాయి. నాలుగేండ్లుగా కాళేశ్వరం నీటితో కళకళలాడిన రిజర్వాయర్లు నేడు నీళ్లులేక బోసిపోయి కనిపించిన దృశ్యాలపై వరుస కథనాలను అందించింది. మొత్తంగా గోదావరి జలాలు అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక రిజర్వాయర్ తర్వాత మరో రిజర్వాయర్‌ను నింపనున్నారు.

కుడి చెరువు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- బీఆర్ఎస్ నాయకులతో కలిసి చెరువు పరిశీలన

చేర్యాలలో కుడి చెరువును పరిశీలిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఆగస్టు 5: సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి ఆనుకుని ఉన్న కుడి చెరువు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణీశ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పట్టణంలోని కుడి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో ఉన్న చెట్లను తొలిగించాలని చైర్‌పర్సన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఎమ్మెల్యే ఐబీ, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి చెరువులో ఉన్న చెట్లను తొలిగించేందుకు మున్సిపాలిటీకి సహకరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుడి చెరువు పరిరక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని, చెరువు కబ్జాలో ఉందనే విషయం తన దృష్టికి వచ్చిందని, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమగ్రంగా కొలతలు వేయించి చెరువు పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. చెట్లను తొలిగించడంతోపాటు వరదనీరు వచ్చే మార్గం, కట్ట పరిస్థితి తదితర అంశాలను స్థానిక రైతులతోపాటు బీఆర్ఎస్ నాయకులతో చర్చించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెరువుల సంరక్షణ కోసం మిషన్ కాకతీయ పథకం ప్రవేశపెట్టడంతో ఎండిపోయిన చెరువులకు పూర్వవైభవం వచ్చిందన్నారు. చెరువులకు గోదావరి జలాలు రావడంతో భూగర్భ జలాలు పెరిగి పంటలు పుష్కలంగా పండినట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కారు హయాంలో గోదావరి జలాలను ఎత్తిపోసి, చెరువులకు మళ్లిస్తే ఎంతో బాగుండేదని, గోదావరి నీళ్లు మొత్తం సముద్రం పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, టౌన్ సెక్రటరీ బూరగోని తిరుపతి గౌడ్, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, టౌన్ అధ్యక్షుడు యాట భిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ మంచాల కొండయ్య, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలుయాదవ్, గదరాజు చందు, నాయకులు కూరపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బంగారం చోరీ కేసుపై విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ రూపేశ్

కోహీర్, ఆగస్టు 5 : చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జూలై 26న జరిగిన బంగారం చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేశామని ఎస్సీ రూపేశ్ వెల్లడించారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. ముంబయికి చెందిన నగల వ్యాపారి విశాల్ జైన్ తన గుమస్తా ఆశిష్ జైన్‌కు హైదరాబాద్‌లో విక్రయించేందుకు 5కిలోల బంగారం అప్పగించాడు. అతడు హైదరాబద్‌కు వచ్చి 2.100 కిలోల బంగారం విక్రయించి మిగతా 2.900 కిలోల బంగారంతో ముంబయికి పయనమయ్యాడు. ఆరెంజ్ ట్రావెల్స్‌లో ముంబయికి వెళ్తున్న క్రమంలో సత్వార్ సమీపంలోని కోహినూర్ దాబా వద్ద భోజనం కోసం కిందకు దిగాడు. తర్వాత బస్సులోకి వెళ్లి చూసే సరికి బంగారంతో ఉన్న బ్యాగు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుల కోసం వారం రోజుల నుంచి గాలిస్తున్నారు. ఆదివారం రాత్రి బూర్దిపాడ్ సమీపంలోని జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. బ్రిజ్జా కారులో అనుమానాస్పదంగా ఉన్న ముస్తాక్‌ఖాన్‌ను విచారించగా జహీరాబాద్ దాబాల్లో మరోసారి చోరీ చేసేందుకు వచ్చామని తెలిపాడు. తామే బంగారం చోరీ చేసినట్లు అంగీకరించాడు. మధ్యప్రదేశ్‌లోని దార్ జిల్లా దార్వాల్‌పురాకు చెందిన అష్రాఫ్, ఫెరోజ్, సాజిద్ పారిపోయారు. ముస్తాక్‌ఖాన్ వద్ద ఉన్న బ్యాగును సోదా చేయగా అందులో 2.900కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వాటి విలువ రూ.3.10 కోట్లు ఉంటుందని వెల్లడించారు. డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐ శివలింగం, ఎస్సైలు కాశీనాథ్, రాజేందర్ రెడ్డి, శ్రీపాదరావు, రామానాయుడు, శ్రీకాంత్, సిబ్బంది లక్ష్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, రెఖ్యా, రశీద్, సయ్యద్ అస్లాం, రాజశేఖర్, అన్వర్ పాషా, శశిధర్ తదితరులు కలిసి వాహన తనిఖీల్లో పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో కొత్తగా 300మందిపై రౌడీషీట్ ఓపెన్ చేశామని ఎస్సీ వెల్లడించారు.